# విపశ్యన మాసపత్రిక

VOLUME:27 NO - 18 1 SEPTEMBER, 2019

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్త, వనస్థలిపురం, హైదరాబాదు – 70

**"ధర్మవాణి"**

*అకతం దుక్కతం సెయ్యో, పచ్ఛా తపతి దుక్కతం !*
*కతఞ్చ సుకతం సెయ్యో, యం కత్వా నాను తప్పతి !!*

*– ధమ్మపద – 314, నిరయ వగ్గో*

దుష్కృతాలు (చెడు పనులు) చేయకపోవటం శ్రేయస్కరం. దుష్కృతాలు తరువాతి కాలంలో బాధిస్తాయి. సుకృతాలు (మంచిపనులు చేయటం) శ్రేయస్కరం. సుకృతాలు తరువాతి కాలంలో బాధను కలుగజేయవు.

## విపశ్యనా సాధన స్వర్ణ జయంతి సందర్భంగా పూజ్య గురూజీ పట్ల కృతజ్ఞతను ప్రకటించుకునే సదవకాశం

**(మూలం: ఆగస్టు 26, 2018 న వెలువడిన హిందీ మాసపత్రిక )**

*1969వ సంవత్సరం జూలై 3వ తేదీన ముంబయిలోని పంచాయతీ వాడీ ధర్మశాలలో, భారతదేశంలో విపశ్యన సాధన యొక్క మొదటి శిబిరం నిర్వహించబడింది. భారతదేశంలో ఈ విద్య పునఃస్థాపితమయి, 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఒక సంవత్సరం పాటు – అనగా 3 జూలై 2018 నుండి 2 జూలై 2019 వరకూ – స్వర్ణజయంతి ఉత్సవాలు జరుపుకోవాలనే సంకల్పం తీసుకోవడం జరిగింది. తద్వారా సాధకులు తమ రోజువారీ సాధనలో పుష్టి చెందటానికి అవసరమైన ప్రేరణ పొందటానికి దోహద పడుతుంది. అందుకని, ఈ సంవత్సరం అంతా గ్లోబల్ పగోడాలో, ప్రతిరోజూ ఒక్కరోజు శిబిరాలు నియమిత రూపంలో నిర్వహించబడ్డాయి. సాధకులకు ఏరోజు సమయం దొరికితే, ఆ రోజు ఈ శిబిరాల నుండి ప్రయోజనం పొందారు. వీటితో సాధకుల సాధనలో కూడా నిరంతరత మరియు క్రమబద్ధత వస్తుంది, ఆ తరువాత అలాంటి వారి నుండి ప్రేరణ పొంది, తమలో సద్ధర్మం పట్ల ఆసక్తి కలిగితే, వీలయినంత ఎక్కువ మంది శిబిరాల్లో పాల్గొని, తమ మేలు చేకూర్చుకుంటారు. ఇదే విధంగా, ఇతర ప్రాంతాల్లో కూడా, రోజువారీ సాధన, సామూహిక సాధన మరియు ఒక్కరోజు శిబిరాల ద్వారా ఈ విద్యలోని వ్యావహారిక పక్షాన్ని అంటే సాధనలో ఆచరణ పరంగా తమను తాము దృఢపరుచుకోవడానికే ఈ వేడుకలు జరుపుకోబడ్డాయి. ఇదే పూజ్య గురుదేవుల పట్ల మనం చూపించే అసలైన కృతజ్ఞత, నిజమైన శ్రద్ధాంజలి.*

*విశ్వ విపశ్యనాచార్యులు పూజ్య శ్రీ సత్యనారాయణ గోయంకా సంక్షిప్త జీవిత పరిచయం, వారి మాటల్లోనే – **రెండవ భాగం.***

మాష్టారు కల్యాణదత్త దూబే గారు నిజంగానే ఎంతో మేలు చేశారు. రహీమ్, తులసీదాస్‌ల ఆధ్యాత్మిక రచనలు, నేను బాల్యంలో ఉన్నప్పుడే, నా మనసును ధర్మం వైపుకు మళ్ళేలా చేసాయి. అవి నాకు జీవితకాలమంతా ఉపయోగపడ్డాయి.

**కొన్ని సంఘటనలు:**

స్కూలులో చదువుకునే రోజుల్లో జరిగిన ఒక సంఘటన. దేశ సుప్రీం కోర్టు జడ్జీ శ్రీ బీజీబాయీ గారి ప్రయత్నంతో, 7వ తరగతిలో ప్రభుత్వం తరపున "ప్రథమ చికిత్స" అనే పాఠం బోధించబడింది. విషయావగాహనకు మాకు ఒక పుస్తకం ఇవ్వబడింది. అయితే చిన్నప్పటి నుండీ పుస్తకాలు చదివే అలవాటు ఉండటంతో, అంతకంటే పెద్ద పుస్తకాన్ని నేను కొని ఉన్నాను. అలా పుస్తకాలు కొనటానికి కావలసిన అనుమతిని మా నాన్నగారు మాకిచ్చారు. దీనిని చూసిన పరీక్షకుడైన డాక్టర్ గారు ఎంతో ప్రసన్నులయ్యారు. పరీక్షలో వారడిగిన ప్రతి ప్రశ్నకూ అవసరమైన దానికంటే మరింత విపులంగా, సరైన సమాధానమిచ్చి మయన్మార్ విద్యార్థులందరిలో మొదటి ర్యాంకు తెచ్చుకున్నాను. డాక్టర్ గారు తన వ్యాఖ్యలో, "ఈ అబ్బాయి అందరికంటే చురుకైనవాడు" అని రాసుకున్నారు. వారి సిఫార్సు మేరకు, అప్పటి మయన్మార్ బ్రిటిష్ గవర్నర్ క్రోక్రిన్, ఒక పెద్ద సభలో నాకు బంగారు పతకాన్ని ప్రధానం చేశారు. వీటన్నింటికంటే మా మేనత్త గారి మొదటి శిక్షణనే బలమైనది.

నాకు మొదటగా విద్యాబుద్ధులు నేర్పిన నా గురుమాత, ధర్మమయి నా మేనత్తగారి మందలింపుతో పాటు, కాసూ గురువు గారు మరియు ఇతర గురువుల వాత్సల్య పూరిత శిక్షణ కారణంగా నేను ప్రతి తరగతిలోనూ మొదటి ర్యాంకు తెచ్చుకున్నాను. నాకు విద్య నేర్పిన గురువులందరూ నాలోని ప్రతిభను గుర్తించి నా పట్ల విశేషంగా ప్రసన్నత చెందారు. మేనత్తను గుర్తుకుతెచ్చుకున్నప్పుడల్లా నా మనసు, వారి పట్ల కృతజ్ఞతతో కూడిన గౌరవభావంతో నిండిపోతుంది. గురువుల పట్ల గౌరవాన్ని కలిగి ఉండాలని ఆమె నేర్పించిన పాఠాన్ని నేను జీవితాంతం మర్చిపోలేదు. "ఏ గురువునూ ఎప్పటికీ నిందించకూడదు" – అనే ప్రతిజ్ఞను జీవితాంతం ఆచరించాను.

**అందుకు ఒక ఉదాహరణ:**

ఖాలసా స్కూలులో ఉపాధ్యాయులందరూ సిక్కులే ఉండేవారు. వారెంతో మంచివారు, ఒకరిని మించిన వారు మరొకరు. ఇక ప్రధానోపాధ్యాయుల గురించి ఏమని చెప్పాలి? తెల్లటి, పొడవాటి గడ్డం ఉన్న కారణంగా చూడటానికెంతో భవ్యంగా కనిపించేవారు. కానీ ఒక సంఘటనతో కొద్దిగా అయిష్టత వచ్చేసింది. స్కూలు నియమాల ప్రకారం, విద్యార్థులెవరూ హోళీ ఆడుకుని స్కూలుకు రాకూడదు. అయితే, హోళీ రోజున స్కూలుకు బయలుదేరిన నాకు, ఒక దుష్ట బాలుడు తనవద్ద రంగులేవీ లేకపోయినా, ఇంకు పెన్నులోని ఇంకునే నా మీదకు చల్లాడు. మేము స్కూలుకు వెళ్ళగానే మాష్టారుగారెంతో కోపగించుకున్నారు. బట్టలమీద హోళీ రంగులతో ఉన్న వారిని వెదురు కర్రతో కొట్టారు, నా వంతు వచ్చింది. ఇందులో నా తప్పేమీ లేదు అని తెలిసినప్పటికీ నేనేమీ చేయలేకపోయాను. అదే వెదురు కర్రతో నాకు కూడా ఒక దెబ్బ పడింది. నేను ఎంతో బాధపడ్డాను. మరుసటిరోజు మాష్టారు గారికి నిజం చెప్పి, నా మనసులో ఆయన పట్ల కలిగిన దుర్భావనకు గాను ఆయన నుండి క్షమాపణ వేడుకున్నాను. దానికి ఆయనెంతో సంతోషించారు. నా పట్ల ఆయనలో ఉన్న వాత్సల్యం ముందుకంటే మరింత ఎక్కువయింది. ఆ సందర్భంలో కాసూ గురువు గారు మరియు మేనత్త గారు నాకు ఎంతగానో గుర్తుకువచ్చారు.

ఖాలసా స్కూలులోని ఉపాధ్యాయులందరూ సిక్కులే ఉండేవారు. కేవలం ఒకే ఒక్క పంజాబీ మాష్టారు ఉండేవారు. వారే హరివంశరాయ్ గారు. వారు కూడా మిగిలిన గురువులందరిలాగానే ఎంతో ఉల్లాసవంతంగా ఉండేవారు. వారు, "మార్వాడీ సమాజంలో ఎంతో దోషం పేరుకుపోయింది, దానిని నీవే తీసివేయాలి" అని పదేపదే అంటుండేవారు. నాకు "చాంద్" అనే పత్రిక యొక్క వార్షిక ప్రతిని తెచ్చిచ్చారు. అందులో మార్వాడీ సమాజాన్ని ఎంతగానో దుయ్యబట్టారు.

ఈ కళంకాన్ని తప్పకుండా దూరం చేస్తాను అని వారికి నేను మాట ఇచ్చాను. దానితో మాష్టారు గారు ఎంతో ప్రసన్నులయ్యారు. వారెంతో పరిపక్వత కలవారు. సమాజంలో పేరుకుపోయిన దోషాలను తప్పక దూరం చేయాల్సిందే అనే శిక్షణను ఇతర గురువుల నుండి కూడా పొందాను. దానితో నేను, మంచి పనులు చేయటానికి పూనుకున్నాను. సమాజంలోని దోషాలను దూరం చేయటంలో అగ్రుడినయ్యాను.

ఆ రోజుల్లోనే ఆర్య సమాజంతో నాకు సత్సంబంధం ఏర్పడింది. ఆర్య సమాజంలో ఉండే పండిత శ్రీ మంగళదేవ శాస్త్రిగారు ఎంతో మంచివారు. వారి నుండి ఎంతో నేర్చుకునే అవకాశం దొరికింది. సమాజ ఉద్ధరణలో వారి పాత్ర ఎంతో గొప్పది.

**మెట్రిక్ విద్య:**

కాసూ గురువుగారు మా చేత ఒకటవ ఎక్కం, ఒకటిన్నరవ ఎక్కం, ఆ తరువాత రెండున్నర మరియు మూడున్నరవ ఎక్కాలు బట్టీ పట్టించటం నా తర్వాతి విద్యాభ్యాసంలో నాకెంతగానో ఉపయోగపడింది. మెట్రిక్ స్కూలులో, దయా హృదయుడు, వృద్ధ వయస్కుడైన ఒక మాష్టారు ఉండేవారు. నేను స్కూలు పరీక్షలన్నింటిలోనూ మొదటి ర్యాంకు తెచ్చుకునేవాడిని. ఆ కారణంగా నా పట్ల వారికి ఎంతో విశేషమైన ప్రేమ ఉండేది. ఒకరోజు నేను వారిని కలిశాను. వారు నా తలమీద చేయి పెట్టి నన్ను ఆశీర్వదించారు. నా సమస్యను నేను వారి ముందుంచాను. అదేమిటంటే, నేను మెట్రిక్ పరీక్ష రాయాలనుకుంటున్నాను, కానీ మా తల్లిదండ్రులు మరో రెండు సంవత్సరాల పాటు మాత్రమే చదువుకోవటానికి నాకు అనుమతిస్తున్నారని వివరించాను.

మా అన్నయ్య బాబులాల్, 7వ తరగతి తరువాత చదువు మానేశాడు. దానితో 7వ తరగతి పూర్తి చేసుకున్న నేను డబుల్ ప్రమోషన్ తీసుకుని, 8వ తరగతి విడిచిపెట్టి, నేరుగా 9వ తరగతిలోకి వెళ్ళటమే నా ముందున్న ఏకైక మార్గం. కాబట్టి నేను 9వ తరగతిలో కూడా మొదటి ర్యాంకే తెచ్చుకుంటానని వారికి నమ్మకం కలిగించాను. స్కూలులోని కర్ణసింగ్ మాష్టారు గారు నాకు రెండు నెలల పాటు ట్యూషన్ చెప్పటానికి కూడా అంగీకరించారు. నాకు అనుమతివ్వటానికి ప్రధానోపాధ్యాయులు గారు ముందు నుండే తయారుగా ఉన్నారు. ఈ అబ్బాయి బాగా చదువుతాడు. అనే నమ్మకం వారికి ఉండేది. దానితో, వారు నాకు డబుల్ ప్రమోషన్ ఇచ్చేశారు. వీరందరి నమ్మకాన్ని నేను వమ్ము చేయలేదు.

కాసూ గురువుగారి శిక్షణ కారణంగానే నేను తొమ్మిదవ తరగతిలో, ఆ తరువాత 10వ తరగతి ప్రభుత్వ బోర్డు పరీక్షలో కూడా హిందీ, గణిత శాస్త్రాల్లో విశేషమైన యోగ్యతను పొందాను. 10వ తరగతిలో మయన్మార్ అంతటిలోనూ మొదటి ర్యాంకు సాధించాను. ప్రభుత్వం తరపు నుండి అందాల్సిన అన్ని సౌకర్యాలూ అంది నాకు ఉపకార వేతనం (Scholarship) లభించినా, నేను మెట్రిక్ తరువాత ఉన్నత విద్యలు చదవలేకపోయాను. నాన్నగారు రంగూన్‌లోని కాలేజీలో చేర్పించినప్పటికీ, అక్కడి పెద్దలు, ముసలివాళ్ళు నా చదువును అడ్డుకున్నారు. వారు నాన్నగారితో, "ఈ వయసులోనే ఈ అబ్బాయి పురాతన సామాజిక వ్యవస్థలను వ్యతిరేకిస్తున్నాడే, మరింత చదువుకుంటే ముమ్ముందు ఏమేం చేస్తాడో!" అని చెప్పారు. వారి మాటలను పట్టించుకున్న నాన్న గారు, రంగూన్ కాలేజీలో చేరిన మూడవ రోజునే నన్ను మాండలేకు తీసుకుని వచ్చేశారు. దానితో నా చదువు అర్థాంతరంగా ముగిసిపోయింది. "ఇక నీవు చదవటానికి వీల్లేదు, చదువుకుని ఉద్యోగం చేసేదయితే లేదు. ఒక వ్యాపారస్థుడు మెట్రిక్ వరకూ చదువుకోవటమే ఎక్కువ, అంతకంటే ఎక్కువ చదువుకుని ఏమి చేయాలి? ఇక వ్యాపారంలో దృష్టిపెట్టి దానిలోని మెళకువలు ఆకళింపు చేసుకో, దుకాణంలో కూర్చో" అని చెప్పేశారు. ఏమీ చేయలేని పరిస్థితిలో కాలేజీ విద్య అంతటితోనే ముగిసిపోయింది. అయినప్పటికీ, నేను ఇంట్లో ఉంటూనే హిందీ చదువుకోవటాన్ని కొనసాగిస్తూ ప్రైవేటుగా పరీక్షలు రాశాను.

**హిందీ ప్రచారము-ప్రసారము:**

మయన్మార్‌లో హిందీ ప్రచారం చేయాలనే ఒక ఆలోచన తలకెక్కింది. మేము అఖిల బర్మాదేశీయ హిందీ సాహిత్య సమ్మేళనాన్ని స్థాపించి, హిందీ ప్రచార కార్యక్రమంలో నిమగ్నమైపోయాము. వారం రోజుల శిబిరాలు నిర్వహించే విద్యాపీఠం ఏర్పాటయింది. నేను ఒక రాత్రిబడిలో హిందీ చదువుకోవటం మొదలుపెట్టాను. భారతదేశంలోని

నాగరీ ప్రచార సభ, వారణాసి; రాష్ట్రభాష ప్రచార సమితి, వార్ధా మరియు హిందీ సాహిత్య సమ్మేళనం, ప్రయాగలను సంప్రదించి, వారి నుండి పుస్తకాలు తెప్పించుకుని వాటిని మయన్మార్‌లో చదివించి, పరీక్షలు రాయించేవాళ్ళం. నేను కేవలం 'మధ్యమ' వరకే చదివినప్పటికీ, కొందరు విద్యార్థులకు సహకారం అందించి, వారిచేత 'ఉత్తమ' పరీక్షలు కూడా పాస్ చేయించాను. మెల్లగా కాలం మారిపోయింది. మయన్మార్‌లో మిలిటరీ పాలన వచ్చేసింది. దానితో బయటి దేశాల నుండి పుస్తకాలు తెప్పించటం మానేశారు. మేము మాత్రం ప్రయాగలోని హిందీ సాహిత్య సమ్మేళనంతో ఇదివరకే జతకూడి ఉన్న కారణంగా వారు నిర్వహించే ప్రథమా, మధ్యమా మరియు ఉత్తమా పరీక్షలకు తగిన శిక్షణనిచ్చి, పరీక్షలు నిర్వహించే కార్యం ఎంతో పద్ధతిగా చేయబడేది. ఎందరో విద్యార్థులు వాటిలో పాల్గొనేవారు. అయితే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ బోధన నిలిపివేయబడటంతో ప్రాథమిక స్థాయిలో హిందీ బోధనకు మాకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దానితో నేను మరికొంత మంది మిత్రులతో కలిసి, నాలుగవ తరగతి వరకూ పాఠ్యపుస్తకాలు తయారు చేయించి వాటిని మయన్మార్‌లోనే ముద్రించి చదివించటం మొదలుపెట్టాము. వాటిలో రాష్ట్రభాషా ప్రచార సమితి, వార్ధా వారి పుస్తకాలే ముఖ్యమైనవి. కానీ వారి అనుమతి లేకుండా, ఏ పాఠ్యపుస్తకమూ అమోదయోగ్యం కాదు. రాష్ట్రభాషా ప్రచార సమితి, వార్ధా యొక్క విశిష్ట కార్యకర్త భదంత ఆనంద కౌసల్యాయన్ గారికి నేను మంచి పరిచయస్థుడనయ్యాను. వారు మయన్మార్ వచ్చినప్పుడల్లా గోయంకా నివాసంలోనే బస చేసేవారు. వారి సహకారంతో, ఈ పుస్తకాలకు తగిన అంగీకారాన్ని పొందటంలో ఎటువంటి ఇబ్బందీ కలగలేదు. అంటే, మేము తయారుచేయించిన పుస్తకాలకు వారి అనుమతి లభించింది. ఈ విధంగా పుస్తకాలు సమకూర్చుకునే సమస్య పరిష్కరింపబడి, హిందీ ప్రచార పనులు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగాయి.

భారతదేశంలోని బ్రిటిష్ పార్లమెంటు, విప్లవ సాహిత్య పుస్తకాల ముద్రణను నిలిపివేసింది. అయినప్పటికీ, నేను భదంత ఆనంద్ గారి ద్వారా ఆ పుస్తకాలను మయన్మార్‌కు తెప్పించాను. దీనితో హిందీతో పాటు, దేశం పట్ల ఒక విప్లవకారునిలోని బలీయమైన సేవాభావపు ఉత్సాహం కూడా నాకు ఒంటపట్టింది. వాటిలో శ్రీ మన్మథనాథ గుప్తా రచించిన ఒక పుస్తకంలో భారతీయ విప్లవాన్ని అన్ని కోణల్లోనూ వర్ణించారు. దాని నుండి నాకెంతో ప్రేరణ లభించింది, నా కవితల్లో దేశభక్తి తొణికిసలాడసాగింది. ఈ విధంగా మయన్మార్‌లో హిందీ ప్రచారం సులభంగానే కొనసాగింది.

**కవితా రచనలు:**

నాకు చిన్నప్పటి నుండీ కవితలు రాసే ఆసక్తి ఉండేది. మయన్మార్‌లో ఉంటూ ఎన్నో విషయాల మీద కవితలు రాసి, అక్కడి సభల్లో కవితా పఠనం చేశాను.

నేను ప్రముఖంగా, సాహిత్యాత్మక, దేశప్రేమ, నాయకుల గొప్పతనాలను వర్ణించటం, దేశసేవలో వారి పాత్ర, కుటుంబీకం, పండుగలు మొదలగు అంశాల ఆధారంగా కవితా రచనలు చేశాను. వీటిలోని కొన్ని కవితలు మయన్మార్‌లో ముద్రింపబడితే, మరికొన్ని ఆంశిక రూపంలో భారతదేశంలోని వేర్వేరు పుస్తకాలు, పత్రికల్లో ముద్రింపబడ్డాయి. ఈ కవితలు **"మేరీ కవితాయే"** అనే పుస్తక రూపంలో సంకలనం చేయబడ్డాయి. అందులో ఎన్నో కవితల రచనాకాల తిథులు కూడా నమోదుచేయబడ్డాయి.

**హిందీ రచనలు:**

హిందీ భాష మీద తగినంత పట్టు ఉన్న కారణంగా పదిహేను సంవత్సరాల వయసులో, నేను తొమ్మిదవ తరగతి చదువుతుండగా ఒక వ్యాసం రాశాను. అది రంగూన్‌లో ప్రచురితమయ్యే ఒక వారపత్రికలో ముద్రింపబడింది. నా సంతోషానికి అవధుల్లేవు. నా వ్యాసం మయన్మార్ యొక్క సుప్రసిద్ధ వారపత్రికలో ప్రచురింపబడింది అని అందరూ తెలుసుకోవాలని, నేను కూర్చునే బెంచీ ముందుండే డెస్క్ మీద పత్రికలోని ఆ వ్యాసం ఉన్న పేజీని తెరిచిపెట్టేవాడిని. ఖాలసా స్కూలులో హిందీ ఉపాధ్యాయులు ఉండేవారు కాదు. దానితో వారు ఒక ఉపాధ్యాయుడిని నియమించారు. ఆయన ఆర్య సమాజానికి చెందిన వ్యక్తి. వారికి "ఖరీబోలి" (ఆధునిక హిందీ) పట్ల తగినంత జ్ఞానముంది కానీ, వారు సూరదాస్, తులసీదాస్‌ల రచనలనెప్పుడూ చదవనేలేదు. ఆ కారణంగా, అవధీ మరియు బ్రజభాషల గురించి వారికేమీ తెలియదు. నేను చదివే తరగతిలో హిందీ బోధించటానికి వారు నియమింపబడ్డారు. "మాధురీ పద్య పారిజాత్" అనే మా పాఠ్యపుస్తకంలో అవధీ మరియు బ్రజభాషలకు చెందిన ఎన్నో పదాలు ఉండేవి. ఆ రోజుల్లో, నా వద్ద ఒక హిందీ శబ్దకోశం ఉండేది. వారికేదైనా కఠిన పదానికి అర్థం కావాలంటే, నా వద్దనున్న శబ్దకోశం నుండి సహాయం తీసుకునేవారు.

ఆ రోజు నా డెస్కు మీద ఉన్న పత్రికను చూసి, "చదువుకునే సమయంలో పత్రికను ఎందుకు తెరిచిపెట్టుకున్నావు?" అని అడిగారు. ఆ పత్రికలో ముద్రింపబడిన నా వ్యాసాన్ని వారికి చూపిస్తే – అంతటి స్వచ్ఛమైన హిందీ భాషలో అది నేను రాసిన వ్యాసమేనా – అని వారికి నమ్మకమే కలగలేదు. దానితో వారు నాకు ఒక అంశాన్నిచ్చి, ఆ అంశంపై అప్పటికప్పుడే రెండు పేజీల వ్యాసాన్ని రాయమని చెప్పారు. నేను వ్రాసిన వ్యాసాన్ని చూసి వారెంతో ముగ్ధులయ్యారు. ముందునుంచీ నేను వారి ప్రియ శిష్యుడినైనప్పటికీ, అప్పటినుండి మరింత ఎక్కువ ప్రియశిష్యుడినైపోయాను. మొత్తం తరగతిలో నేనొక్కడినే హిందీ విద్యార్థినయితే, ప్యారేలాల్ మాష్టారు ఏకైక హిందీ ఉపాధ్యాయులు.

**కృష్ణుని పట్ల చెదరని శ్రద్ధ:**

మయన్మార్‌లోని మాండలేలో మా కుటుంబానికి ఒక టోకు బట్టల దుకాణం ఉండేది. అందులో ఎక్కువగా జపాన్, ఇంగ్లాండ్‌లలో తయారయిన బట్టలే అమ్ముడుపోయేవి. అయితే మహాత్మాగాంధీ, స్వదేశి ఆందోళన చేపట్టటంతో ముంబయి మరియు అహ్మదాబాద్‌లలోని మిల్లుల్లో తయారైన దుస్తులు మయన్మార్‌కు దిగుమతి కావటం మొదలయింది. అవి కూడా మా దుకాణంలో అమ్ముడుపోసాగాయి. ఆ దుస్తుల తాన్ల మీద ఏదో ఒక బొమ్మ అతికించబడి ఉండేది. వాటిలో ఎక్కువభాగం దేశ స్వాతంత్రోద్యమ నేతల చిత్రపటాలు కానీ, ఆరాధ్య దైవాల పటాలు కానీ ఉండేవి. ఒకసారి నా ఆరాధ్యదైవమైన శ్రీ కృష్ణ భగవానుని అత్యంత సుందర చిత్రం

అతికించబడి ఉండటాన్ని చూశాను. నేను ఎంతో ప్రేమతో, శ్రద్ధతో వేరుచేసి కిషోర వయసులో నాకున్న తెలివితేటలతో దాని సైజులో ఒక కార్డుబోర్డు కత్తిరించి, దానిమీద ఆ పటాన్ని అతికించాను. ఇంకా అది పాడవకుండా దానిమీద ఒక పారదర్శకమైన ప్లాస్టిక్ పేపరుని అతికించి పెట్టాను. అది నా చొక్కా జేబులో పట్టేంత సైజులో ఉండేది.

ఆ పటం పట్ల నా మనసులో ఎంత లోతైన శ్రద్ధాసక్తులు ఉండేవో నాకు బాగా గుర్తుంది. కిషోర వయసు నుండి తరువాతి 20 సంవత్సరాల వరకు నేను బర్మాలో ఉన్నా, భారతదేశంలో ఉన్నా, మరే దేశంలో యాత్రలో ఉన్నా, ఏ చొక్కా వేసుకున్నా, దాన్ని చొక్కా పై జేబులో పెట్టుకుని హృదయానికి హత్తుకునేలా ఉంచుకునేవాడిని. నా జీవితకాలపు విజయాలన్నీ, ఈ పరమేశ్వరుని కృపతోనే ప్రాప్తిస్తున్నాయి అని నేను బలంగా నమ్మేవాడిని.

ఆ తరువాతి కాలంలో హై స్కూలు పరీక్షల్లో నేను మయన్మార్‌లో ఆ సంవత్సరం హైస్కూలు పరీక్షలు రాసిన అందరిలోనూ మొదటి ర్యాంకు తెచ్చుకున్నాను. నాకు ప్రభుత్వం తరపున ఉపకార వేతనం వచ్చింది. ఇదంతా ఆ ఈశ్వరుని కృపతోనే వచ్చాయి అని నేను నమ్మేవాడిని.

నాకు పద్దెనిమిది సంవత్సరాల వయసు ఉన్నప్పుడు, జపాన్ యుద్ధం మొదలవటంతో, నేను మా కుటుంబమంతటికీ యజమానినై కొండలు, గుట్టల దారుల్లో కాలిబాటన నడుస్తూ మయన్మార్ నుండి భారతదేశానికి చేరుకున్నాము. ఆ తరువాత రైలుబండిలో ప్రయాణిస్తూ మా పూర్వీకుల నగరమైన చూరూకి చేరుకున్నాము. అక్కడకు చేరుకోగానే కుటంబ సభ్యులందరూ ఎంతో అనారోగ్యం బారిన పడ్డారు. కేవలం నేను, మా వదినమ్మ గారు (బాబూలాల్ అన్నయ్య యొక్క భార్య) మాత్రమే ఆరోగ్యంగా ఉన్నాము. ఇతర సభ్యులందరి ఆరోగ్యం ఎంతో కుంటుపడింది. మేమిద్దరమూ రోగుల సేవలో నిమగ్నమైపోయాము. అప్పుడు కూడా, నేను రోగం బారిన పడకుండా ఉండటానికి ఈ మహా ఈశ్వరుని కృపయే కారణం అని నమ్మేవాడిని. ఆ తరువాతి కాలంలో దక్షిణ భారతదేశంలోని వ్యాపారంలో ఆశించిన దానికంటే ఎక్కువ విజయం చేకూరటానికి కూడా నా ఈశ్వరుని అనుగ్రహమే కారణం అని నమ్మేవాడిని.

జపాన్ యుద్ధం ముగియగానే మయన్మార్‌కు తిరిగి వెళ్ళాక, అక్కడ వ్యాపారపరంగా, సామాజిక పరంగా, ప్రభుత్వ పరంగా అన్ని క్షేత్రాల్లో సాధించిన విశేష ఫలితాలకు కూడా, దయగల నా ఇష్టదేవుని అనుగ్రహమే కారణం అని నమ్మేవాడిని. సామాజిక క్షేత్రంలో ఎన్నెన్ని సంస్థలకు అధ్యక్షుడిగా ఉన్నానో నాకే తెలియదు. ప్రత్యేకించి, కొందరు స్నేహితులతో, "అఖిల బర్మాదేశీయ కాంగ్రెస్" ను స్థాపించి మయన్మార్ అంతటా దాదాపు 50 శాఖలు ఏర్పాటు చేశాము. అదే విధంగా, "అఖిల బర్మాదేశీయ హిందీ సాహిత్య సమ్మేళనం" ను స్థాపించి, దాదాపు 10 శాఖలను ఏర్పాటు చేశాము. మయన్మార్‌లో హిందీ ప్రచార పనుల్లో పూర్తిగా తలమునకలై ఉండేవాడిని. ఒక వారం పాటు నడిచే సాహిత్య గోష్ఠిలను నిర్వహిస్తూ, వాటితో పాటు రాష్ట్రీయ విద్యాపీఠాన్ని స్థాపించి హిందీ ఉన్నత శిక్షణకై చదువుకుంటూ – చదివిస్తూ ఉండేవాడిని. ఇంకా, "మహాత్మాగాంధీ స్మారక ట్రస్ట్" ను స్థాపించి, గాంధీజీ ఆత్మకథతో పాటుగా వారు రాసిన మరికొన్ని పుస్తకాలను కూడా బర్మీ భాషలోకి అనువదింప చేశాము. "బర్మాభారతీ కళా కేంద్రం" ను స్థాపించి, నాటక ప్రదర్శనలను కూడా విజయవంతంగా నిర్వహించాను.

– తరువాయి భాగం వచ్చే సంచికలో.

– **ఆత్మ కథన్ 2** నుండి సంగ్రహించబడింది.

## 10 రోజుల ప్రత్యేక శిబిరము

ధమ్మ ఆరామ, భీమవరంలో 17 సెప్టెంబర్ నుండి 28 సెప్టెంబర్ వరకూ పది రోజుల ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.

రెండు సంవత్సరాలకు చందా రూ **100/-** **వివశ్యన తెలుగు మానవత్రిక** జీవిత చందా రూ. **500/-**
ప్రచురణ తేది: ప్రతినెల **30/31** పోష్టింగ్ తేది: ప్రతి నెల **1/2** వెల: రూ **5/-**
**వివశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070.**
**ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం) ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745

**PRINTED MATTER**

If Undelivered please return to :
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org

Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam. Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.